క్లుప్తంగా

వైభవంగా అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట



ప్రతిష్ట నిర్వహించిన అభయాంజనేయ స్వామి విగ్రహం

మర్రిపాడు: మండలంలోని అచ్చమాంబ దేవస్థానం సమీపంలో నెల్లూరు - ముంబై జాతీయ రహదారి పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీఅభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం గురువారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అభయాంజనేయస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మొక్కులు చెల్లించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. మాగంటి శ్రీనివాసులు రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మాడభూషి శేషాచారి విగ్రహావిష్కరణ



అల్లూరు: రామకృష్ణా విద్యాసంస్థల స్థాపకుడు శ్రీమాన్ మాడభూషి శేషాచారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని ఆ విద్యాసంస్థల యాజమాన్యం, మాడభూషి కుటుంబం సంయుక్తంగా గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ అల్లూరులో దాదాపు 100 సంవత్సరాల క్రితమే రామకృష్ణా మిడిల్ స్కూల్ స్థాపనకు కృషి చేశారని తెలిపారు. ఎంతోమంది పేద విద్యార్థులకు విద్యనందించిన విద్యా ప్రదాతగా నిలిచారని తెలిపారు. అలాంటి మహానుభావుడు మాడభూషి శేషాచారి విగ్రహాన్ని ఆవిష్కరించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ వి.శ్రీనివాసులు, మాడభూషి కుటుంబ సభ్యులు మాడభూషి మాధవన్, వి.శ్రీధర్, వైజయంతి, శ్రీనివాసన్, వేణు, జవహర్, ఇందిర, రాధ, విద్యాసంస్థల ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


కృత్రిమ మేధపై అవగాహన

కొడవలూరు : మండలంలోని నార్తురాజుపాళెంలో ఉన్న శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో 'కృత్రిమ మేధ-పరిశోధనా పరిధి'పై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పట్నా సీడ్యాక్ ఏఐ రీసెర్చ్ సెంటర్‌కు చెందిన పి.సాయికుమార్ ముఖ్యవక్తగా వ్యవహరించారు. కృత్రిమ మేధపై పరిశోధనా విషయాలు, అన్ని రంగాల్లో కృత్రిమ మేధ ఉపయోగాలను ఆయన విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో సీఎస్సీ విభాగాధిపతి డాక్టర్ నాగేంద్ర, ఏఐడీఎస్ విభాగాధిపతి జీవన్‌కుమార్, బీటెక్ ద్వితీయ, తృతీయ సంవత్సరపు విద్యార్థులు పాల్గొన్నారు.

అధికారుల బదిలీలు

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో పలు మండలాల్లో వివిధ హోదాల్లో విధులు నిర్వహిస్తున్న పలువురు అధికారులను బదిలీ చేస్తూ గురువారం రాత్రి కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. కందుకూరు తహసీల్దార్‌గా ఎం నిరంజన్‌బాబును నియమించారు. అనంతసాగరం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తూ సెలవులో ఉన్న టీ ప్రదీప్‌ను తెలుగుగంగ ప్రాజెక్ట్ రాపూరు యూనిట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయ స్పెషల్ డిప్యూటీ తహసీల్దార్‌గా నియమించారు. పొదలకూరు తహసీల్దారు కార్యాలయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఐ నవీన్‌కుమార్‌ను కలెక్టరేట్ డీ సెక్షన్ సీనియర్ అసిస్టెంట్‌గా బదిలీ చేశారు. చేజర్ల మండలంలో రీసర్వే డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం గిరీష్‌ను దుత్తలూరు డిప్యూటీ తహసీల్దార్‌గా బదిలీ చేశారు. కలువాయి మండలం కసుపూరుపల్లి బిట్-1 వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్న డీ జయరామయ్యను మర్రిపాడు మండలానికి బదిలీ చేశారు.

కసుమూరులో స్వచ్ఛభారత్



వెంకటాచలం : మండలంలోని కసుమూరులో అదిశంకర ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు గురువారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్ట్‌కు సంబంధించి టీమ్ లీడర్లు కందుకూరు యశ్వంత్, పి.కార్తీక్ ఆధ్వర్యంలో పలువురు విద్యార్థులు ముందుగా వీధులను శుభ్రం చేశారు. పలు దుకాణాల వద్దకు వెళ్లి శుభ్రత, ఆరోగ్యం గురించి అవగాహన కల్పించారు. దుకాణాల వద్ద ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకుంటే అంటు రోగాలు ప్రబలవని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బి.లక్ష్మీపతి, యశ్వంత్ కృష్ణ, సింహాద్రి, దీపక్, హేమలత, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి భరోసా

- కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ముంగిటకే ప్రభుత్వ వైద్యసేవలను తీసుకువచ్చి పేదల ఆరోగ్యానికి భరోసా కల్పించారని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కావలి పట్టణంలోని కచ్చేరిమిట్టలో 20, 21, 24, 27 వార్డులకు సంబంధించి జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని గురువారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని, ప్రతి కుటుంబ ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. ఏపీని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడానికి ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేసి మౌలిక సదుపాయాలు కల్పించారని తెలిపారు. గ్రామీణ స్థాయి నుంచే మెరుగైన వైద్యసేవలు అందించేలా విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేశారని తెలిపారు. ప్రస్తుతం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాల్లో ప్రజలకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తున్నారని, మెరుగైన వైద్యం అవసరమైన వారిని ఆరోగ్యశ్రీ రెఫరల్ ఆస్పత్రులకు పంపుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి మంచి స్పందన వస్తోందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాల్లో నిపుణులైన వైద్యులు పేదలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నారని తెలిపారు. సచివాలయ, వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ముందుగా ఆరోగ్య సమస్యలు ఉన్న వారిని గుర్తించి ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాల్లో పరీక్షలు చేయించేలా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కనమర్లపూడి వెంకటనారాయణ, పందిటి కామరాజు, కుందుర్తి శ్రీనివాసులు, బోగిరి విన్సెంట్‌కుమార్, ఎం.గిరి, చిరంజీవిరెడ్డి, కొండయ్య, కోదండం, చెన్నయ్య, రంతుల్లా, కరిముల్లా, కలికి శ్రీనివాసులురెడ్డి, దేవర ప్రమోద్, కుందుర్తి కామయ్య, పేరం వెంకటేశ్వర్లు, గుడ్లూరు మాల్యాద్రి, ఏగూరు చిన్న పుల్లయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో ఆరోగ్య సురక్ష

- 406 మందికి ఉచిత వైద్యసేవలు



మహిళకు ఆరోగ్య సురక్ష మందుల కిట్ అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలోని 17, 19, 20 వార్డులకు సంబంధించి ఏసీఎస్ఆర్ సచివాలయం పరిధిలో గురువారం పట్టణంలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. మొత్తం 406 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశామని వైద్యసిబ్బంది తెలిపారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ శాఖ ఏర్పాటు చేసిన పౌష్టికాహారం స్టాల్ అధికారులు, నాయకులు పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గోపారపు వెంకటరమణమ్మ, కమిషనర్ బల్లి నాగేశ్వరరావు, వైద్యాధికారి అస్మా, వైస్ చైర్మన్ షేక్ సర్దార్, కౌన్సిలర్లు కొండా స్వరూపరాణి, కొప్పోలు రమాదేవి, సూరా భాస్కర్‌రెడ్డి, నాయకులు షేక్ జమీర్‌బాషా, ముజీబుల్లా, కొండా వెంకటేశ్వర్లు, కొప్పోలు చిన్నపరెడ్డి, షౌకత్‌అలీ, బొలిగర్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పెద్దకొండూరులో 287 మందికి వైద్యపరీక్షలు



వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న మాల్యాద్రిరెడ్డి, రవీంద్రారెడ్డి

కలిగిరి: మండలంలోని పెద్దకొండూరులో గురువారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరంలో 287 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. వైద్యనిపుణులు రోగులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి బొల్లినేని వెంకటసత్యనారాయణ, ఎంపీడీఓ ఆర్‌వీ కళాధర్‌రావు, వైద్యాధికారిణి గీతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శ



కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న రాజగోపాల్‌రెడ్డి

దుత్తలూరు: మండలంలోని రాచవారిపల్లి గ్రామానికి చెందిన పాలిచర్ల భాస్కర్ ప్రమాదవశాత్తు మృతిచెందగా ఆ కుటుంబాన్ని గురువారం వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, సొసైటీ డైరెక్టర్ వేమారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ అన్నంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ దొంతిరెడ్డి జయసింహారెడ్డి, నాయకుడు ఎల్‌పీ కొండారెడ్డి తదితరులు ఉన్నారు.

2న మండల సర్వసభ్య సమావేశం

ఉదయగిరి: ఉదయగిరి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నవంబర్ 2వ తేదీ ఉదయం 11 గంటలకు స్థానిక స్త్రీశక్తి భవనంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ డి.ఈశ్వరమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ మూలే పద్మజ అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశంలో అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారని తెలిపారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై శాఖల వారీగా సమీక్షించనున్నట్లు తెలిపారు.

ఆర్బీకేల్లో ఈ-క్రాప్ జాబితా

చేజర్ల: ఖరీఫ్ సీజన్‌లో ఈ-క్రాప్ బుకింగ్ చేసిన పంటలకు సంబంధించిన రైతుల జాబితాను ఆర్బీకేల్లో ప్రదర్శించామని మండల వ్యవసాయాధికారి శిరీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు వాటిని పరిశీలించుకొని ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని తెలిపారు. ఈ నెల 29వ తేదీ వరకు ఆర్బీకేల్లో రైతుల జాబితాను ప్రదర్శిస్తారని తెలిపారు.

వాల్మీకి జయంతిని విజయవంతం చేద్దాం

ఆత్మకూరురూరల్: ఆశ్వీయుజ శుద్ధ పౌర్ణమి సందర్భంగా వాల్మీకి మహర్షి జయంతిని ఆత్మకూరులో ఈ నెల 28వ తేదీన నిర్వహిస్తున్నామని, ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని వాల్మీకి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని నెల్లూరులోని అంబేడ్కర్ భవన్‌లో కూడా ఇదే రోజున నిర్వహిస్తున్నామని, జిల్లాలోని రాజకీయ ప్రతినిధులు, ప్రజలు, అన్ని కుల సంఘాల నాయకులు పాల్గొనాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి బీసీ కొండయ్య తదితరులు విజ్ఞప్తి చేశారు.

ఆస్పత్రి తనిఖీ



మాట్లాడుతున్న ఎంపీపీ విజయభాస్కర్‌రెడ్డి

చేజర్ల : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి గురువారం తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో రోగులకు అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. అనంతరం అక్కడ జరుగుతున్న భవన మరమ్మతు పనులను పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యులు గిరీష్, వీరాస్వామి, పోలయ్య పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

చేజర్ల: జాయింట్ కలెక్టర్ ఆర్.కూర్మనాథ్ గురువారం చేజర్ల మండలంలో పర్యటించారు. మొదట తూర్పుపల్లి సచివాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. కొందరు రైతులు జేసీని కలిసి భూసమస్యలకు సంబంధించి అర్జీలు అందజేశారు. అనంతరం పెళ్లేరుకు సంబంధించి రీసర్వే పనులను పరిశీలించారు. రెవెన్యూ సిబ్బందికి పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో డీటీ విజయ్, వీఆర్వో జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



కోవూరు : మండలంలోని పడుగుపాడు నేతాజీనగర్‌లో సుబ్బారావు అనే వ్యక్తి ఆరునెలల క్రితం కేన్సర్‌తో మరణించగా, ఆయన భార్య సరోజినమ్మకు డీఎల్‌డీఏ డైరెక్టర్ కాటంరెడ్డి దినేష్‌రెడ్డి రూ.10 వేల ఆర్థిక సాయాన్ని గురువారం అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, సచివాలయాల మండల కన్వీనర్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సు

ఆత్మకూరురూరల్: ఈ నెల 28న పౌర్ణమి సందర్భంగా ఆత్మకూరులోని ఆర్టీసీ డిపో నుంచి అరుణాచలానికి 27వ తేదీ ఉదయం 8 గంటలకు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు ఏర్పాటు చేశామని ఆత్మకూరు డిపో మేనేజర్ కరిమున్నీసా గురువారం ఒక ప్రకటనలో తెలిపా రు. ఒకరికి టిక్కెట్ ధర రానుపోను రూ.1,400గా నిర్ణయించామని తెలిపారు. మా ర్గమధ్యంలో కాణిపాకం వినాయకుడి ఆలయం, వేలూరు సమీపంలోని సిరిపురం గోల్డెన్ టెంపుల్‌తోపాటు అరుణాచలాన్ని భక్తులు సందర్శించేలా బస్సు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా కూడా టికెట్లు రిజర్వేషన్ చేయించుకోవచ్చని తెలిపారు. వివరాలకు ఆర్టీసీ డిపో మేనేజర్ కరిమున్నీసా (మొబైల్ నంబర్ - 99592 25645), సీఐ కల్పన (మొబైల్ నంబర్ - 99660 09395), బస్సు కండెక్టర్ సుబ్బయ్య (మొబైల్ నంబర్ - 85559 29504)లను సంప్రదించవచ్చని తెలిపారు.

సంఘాలు సమర్థవంతంగా పనిచేయాలి



సమావేశం నిర్వహిస్తున్న ఏపీఎం ఖాజారంతుల్లా

ఉదయగిరి: మండలంలోని స్వయం సహాయక సంఘాలు సమర్థవంతంగా పనిచేయాలని వైఎస్సార్ క్రాంతిపథం ఏపీఎం ఖాజారంతుల్లా పేర్కొన్నారు. గురువారం స్థానిక స్త్రీశక్తి భవనంలో నిర్వహించిన ఈసీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు స్త్రీనిధి రూ.కోటి, ఇతర బ్యాంక్ రుణాలు రూ.13 కోట్లు సంఘాల్లోని సభ్యులకు అందించినట్లు తెలిపారు. సంఘాల్లోని సభ్యులు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించి ప్రభుత్వం అందించే సున్నా వడ్డీ రాయితీ పొందాలన్నారు. ప్రతి నెలా సమావేశాలు నిర్వహించి మినిట్స్ నమోదు చేయాలని తెలిపారు. సమావేశంలో సీసీలు పాల్గొన్నారు.

యాప్‌లో హాజరు నమోదు చేయండి



సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఈశ్వరమ్మ

ఉదయగిరి: మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులకు హాజరయ్యే కూలీల హాజరును ప్రతి రోజూ ఎంఎంఎస్ యాప్‌లో నమోదు చేసి అప్‌లోడ్ చేయాలని ఎంపీడీఓ డి.ఈశ్వరమ్మ తెలిపారు. ఆమె గురువారం స్థానిక ఉపాధి కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూలీల సంఖ్యను పెంచాలన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఈ-ఫైలింగ్ త్వరితగతిన చేయాలని, జాబ్‌కార్డు వెరిఫికేషన్ ప్రక్రియను చేపట్టాలని తెలిపారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



విద్యార్థులకు క్రీడాసామగ్రి అందజేస్తున్న ఎంపీపీ తదితరులు

అనుమసముద్రంపేట: విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ఎంపీపీ బోయళ్ల పద్మజారెడ్డి అన్నారు. మండలంలోని శ్రీకొలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు అరబిందో ఫార్మా ఫౌండేషన్ తరఫున నిర్వాహకురాలు సంహితారెడ్డి సుమారు రూ.2 లక్షల విలువైన క్రీడా పరికరాలను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు-నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటు అభివృద్ధి చేశారని తెలిపారు. దాతల సహకారంతో అందజేస్తున్న క్రీడా పరికరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని క్రీడల్లో రాణించాలని సూచించారు. సంహితారెడ్డి మాట్లాడుతూ తాను చదివిన పాఠశాల విద్యార్థులకు క్రీడా పరికరాలు అవసరమని ఉపాధ్యాయులు తన దృష్టికి తీసుకొచ్చారని, దీంతో అరబిందో ఫార్మా ఫౌండేషన్ ద్వారా అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆత్మకూరు ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, రామాయపట్నం పోర్టు ఇన్‌చార్జి బోయళ్ల చెంచురెడ్డి, ఎంపీడీఓ భాస్కర్, హెచ్ఎం నిరంజన్, పీఈటీ థామస్ పీటర్, ఎంపీటీసీ సభ్యురాలు జయమ్మ, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ మాధవరెడ్డి, సచివాలయ కన్వీనర్ నాగిరెడ్డి చెంచురెడ్డి, నాయకులు రఘురామిరెడ్డి, రమణయ్య, మధు తదితరులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ అర్హుల జాబితా ప్రదర్శన



ఈ-క్రాప్ జాబితాను ప్రదర్శిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు మండలంలో ఖరీఫ్ 2023 సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులకు సంబంధించి మండలంలోని అన్ని రైతుభరోసా కేంద్రాల్లో ఈ-క్రాప్ అర్హుల జాబితాను వ్యవసాయాధికారి కిషోర్ ఆధ్వర్యంలో నోటీస్ బోర్డులో ప్రదర్శించారు. మండలంలోని కరటంపాడు రైతు భరోసా కేంద్రంలో ఏఓ మాట్లాడుతూ మొత్తం 9,787 ఎకరాలను ఈ-క్రాప్ ద్వారా నమోదు చేశామన్నారు. సామాజిక తనిఖీ కోసం అన్ని రైతుభరోసా కేంద్రాల్లో జాబితాలు ప్రదర్శించామని తెలిపారు. రైతుల పేర్లు, సర్వే నంబర్లు విస్తీర్ణం, పంటల సాగు విధానం తదితర వివరాల నమోదులో ఏవైనా పొరపాట్లు ఉంటే ఈ నెల 29వ తేదీ లోపు ఆత్మకూరులోని వ్యవసాయశాఖ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు. అభ్యంతరాలను పరిష్కరించిన అనంతరం నవంబర్ 1వ తేదీన తుది జాబితాలను ఆయా రైతుభరోసా కేంద్రాల్లో ప్రదర్శిస్తామని తెలిపారు. ఈ-క్రాప్ నమోదు ఆధారంగానే రైతుల ఉత్పత్తుల కొనుగోళ్లు, పంటల బీమా, పంట నష్టపరిహారం తదితర ప్రభుత్వ ప్రోత్సాహకాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో వీఏఏ యస్దానీ, ఎంపీటీసీ సభ్యుడు ఖాసీంసా, రైతు నాయకులు నెట్టెం పిచ్చయ్యనాయుడు, శేషయ్య, ప్రకృతి వ్యవసాయం అధికారి పుట్టుబోయిన సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు రాపూరు వెంకటసుబ్బారెడ్డి

సోమశిల: అనంతసాగరం మండలంలో సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించామని జెడ్పీటీసీ సభ్యుడు రాపూరు వెంకటసుబ్బారెడ్డి అన్నారు. గురువారం అనంతసాగరంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు అజెండాలోని అంశాలను చదివి వినిపించారు. రాష్ట్ర క్రీడా సంఘం డైరెక్టర్ కాలువ నరసింహులు, పలువురు ఎంపీటీసీ సభ్యులు పలు అంశాలను సమావేశం దృష్టికి తీసుకురాగా జెడ్పీటీసీ సభ్యుడు సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పేదలందరికీ ఇళ్ల పథకం ద్వారా ఇళ్ల నిర్మాణాల ప్రాంతంలో విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలని విద్యుత్‌శాఖ అధికారులకు సూచించారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి

దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి జయంతిని పురస్కరించుకుని వచ్చే నెల 2వ తేదీన ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో జాబ్ మేళా ఏర్పాటు చేస్తున్నారని, మండలంలోని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకునేలా ప్రజాప్రతినిధులు, అధికారులు నిరుద్యోగులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఆత్మకూరులోని ఆంధ్రా ఇంజినీరింగ్ కళాశాల కేంద్రంగా నిర్వహించే జాబ్‌మేళాలో 24 కంపెనీల సహకారంతో 2 వేల వరకు ఉద్యోగాలు కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మధుసూదన్, వైద్యాధికారి వరలక్ష్మి, వైస్ ఎంపీపీ పాణెం శ్రీనివాసులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

కార్గో వ్యాపారాభివృద్ధికి కృషి చేయాలి



కావలి: ఏపీఎస్ ఆర్టీసీ పార్సిల్ రవాణా విభాగం కార్గో వ్యాపారాభివృద్ధికి సిబ్బంది కృషి చేయాలని కావలి డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు సూచించారు. గురువారం కావలి ఆర్టీసీ డిపోలో డోర్ డెలివరీ మాసోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ 2017లో కార్గో విభాగాన్ని ప్రారంభించగా అతి వేగంగా అభివృద్ధి చెందుతూ 2022-23 సంవత్సరానికి సంబంధించి రూ.160.20 కోట్ల ఆదాయాన్ని సాధించిందని తెలిపారు. వచ్చే నెల 25వ తేదీ వరకు డోర్ డెలివరీ మాసోత్సవాలను నిర్వహిస్తామని తెలిపారు. అతి తక్కువ ధరలతో, తక్కువ సమయంలో ఇంటి వద్దకే 50 కిలోల లోపు బరువున్న పార్సిళ్లను డోర్ డెలివరీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) కేవీఆర్ బాబు, కార్గో ఇన్‌చార్జి డి.రవిప్రకాష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్‌ను ఉపయోగించుకోండి

ఇందుకూరుపేట : పదో తరగతి, ఇంటర్, అంతకంటే తక్కువ చదువుతూ మానేసిన విద్యార్థులు ఓపెన్ స్కూల్‌ను ఉపయోగించుకోవాలని ఓపెన్ స్కూల్ స్టేట్ అబ్జర్వర్ నాగేంద్ర కోరారు. మండలంలోని కొత్తూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం ఓపెన్ స్కూల్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. ప్రతిఒక్కరికీ చదువు చాలా విలువైనదని, మధ్యలో చదువు మానేసిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం మహిళా సంఘ సభ్యులను కలిసి కార్యక్రమ విశిష్టతను తెలియజేశారు. ఈ సందర్భంగా ఇద్దరు వ్యక్తులకు ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు అందజేశారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ ఎగ్జామినేషన్ ఆఫీసర్ రామారావు, ఎంఈఓలు ఎస్వీ నాయక్, సునీల్‌కుమార్, పాఠశాల హెచ్ఎం వి.మల్లికార్జున, సీఆర్ఎంటీ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు తప్పనిసరి

ఇందుకూరుపేట : ప్రతి రైతు తమ పేర్లను ఈ-పంటలో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని, వారికి మాత్రమే ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని మండల వ్యవసాయాధికారి రఘునాథ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కొత్తూరు రైతు భరోసా కేంద్రంలో ఈ-పంటలో నమోదైన రైతుల పేర్లను గురువారం ఆయన ప్రదర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో వాటి పరిధిలోని రైతుల పేర్లను ప్రదర్శించినట్లు తెలిపారు. ఇందుకూరుపేట మండలంలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 6,118 ఎకరాల విస్తీర్ణానికి గానూ 1,836 మంది రైతులను ఈ పంటలో నమోదు చేశామని తెలియజేశారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి



మాట్లాడుతున్న వంశీధర్‌రెడ్డి

ఉదయగిరి: జిల్లాలో గ్రామస్థాయి నుంచి బీజేపీని బలోపేతం చేసేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆయన గురువారం స్థానిక బీజేపీ కార్యాలయంలో జరిగిన పార్టీ మండల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. నవంబర్ 18న పార్టీ అధ్యక్షురాలు పురందేశ్వరి నెల్లూరు వస్తారని, ఆమె జిల్లాలోని అన్ని మండలాల బూత్ స్థాయి అధ్యక్షులతో సమావేశం నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.బుజ్జిరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి కె.రంగారావు, మండల ఇన్‌చార్జి ఎం.మాల్యాద్రినాయుడు, నాయకులు వెంకటేశ్వర్లు, రోశయ్య, షాజాహాన్, గుప్తా, నెల్లూరు వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.